సుఖ సంతోషాలతో జరుపుకోవాలి


బియ్యపు మధుసూదన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి : ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలను మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నూతన సంవత్సరంలో ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.


నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం : సత్యవేదు నియోజకవర్గంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ఆకాంక్షించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని ప్రజలందరికీ నూతన ఆంగ్ల సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఒక్కరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు.

3న ముక్కంటి హుండీ లెక్కింపు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయ హుండీ లెక్కింపు 3వ తేదీ శుక్రవారం లెక్కించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. అధికారులు , సిబ్బంది తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

కొత్త ఊసులు.. కోటి ఆశలు


- ముస్తాబైన ఆలయాలు, చర్చిలు

కొత్త ఊసులు.. కోటి ఆశలతో.. నూతన సంవత్సరానికి ప్రజలు స్వాగతం పలికారు. 2024కి తుది వీడ్కోలు పలికారు. 2025కు ఆహ్వానం పలికే విధంగా మంగళవారం సంబరాలు అంబరాన్నంటాయి. కేక్ కటింగ్‌లు, కేరింతలతో సందడి చేశారు. ఆలయాలు, చర్చిలు వేడుకలకు సిద్ధం చేశారు.

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలంలోని చర్చిలు మంగళవారం విద్యుత్ కాంతులతో ముస్తాబు అయ్యాయి. ప్రధానంగా స్థానిక రోమన్ క్యాథలిక్ చర్చి, లూథరన్ చర్చ్, జీవాగ్రంలోని లూథరన్ చర్చిలో న్యూ ఇయర్ వేడుకలను జరుపుకునేందుకు విద్యుత్ దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. చర్చిలో రాత్రికి ప్రార్థనలు చేశారు.

బుచ్చినాయుడుకండ్రిగ : మండలంలోని ఆలయాలు, చర్చిలు నూతన సంవత్సర వేడుకలకు ముస్తాబయ్యాయి. వేడుకల కోసం ఆలయాలు, చర్చిలకు రంగులు వేసి, విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండలంలో జనవరి 1 వ తేదీన ఆలయాల్లో ప్రత్యేక పూజలు, క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో చర్చిల్లో ప్రార్థనలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

నాగలాపురం : మండల కేంద్రంలోని వేదనారాయణ స్వామి ఆలయంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని ఆలయంలో అన్ని ఏర్పాట్లు చేసినట్లు అధికారి శ్రీనివాసులు తెలిపారు. భక్తులకు దర్శన నిమిత్తం క్యూలైన్‌లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తాగునీటి సౌకర్యం, మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



బీఎన్‌కండ్రిగలో విద్యుత్ దీపాలంకరణలో వేంకటేశ్వరస్వామి ఆలయం, అలంకరణలో అభయాంజనేయస్వామి ఆలయం



విద్యుత్ వెలుగులో లూథరన్ చర్చి, నాగలాపురం : ఆలయంలో దర్శనానికి ఏర్పాటు చేసిన క్యూలు

ముక్కంటి సేవలో ఎంపీ మిథున్‌రెడ్డి


ఎంపీ మిథున్‌రెడ్డితో మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధు సూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి : జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి, పాలకమండలి మాజీ చైర్మన్ తారక శ్రీనివాసులు, ఆలయ అధికారులు వారికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ముందుగా ప్రత్యేక రాహుకేతు పూజలు, మహాన్యాస రుద్రాభిషేకంలో పాల్గొన్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వదించి తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు వయ్యాల కృష్ణారెడ్డి, ఉన్నం వాసునాయుడు, షేక్ సిరాజ్‌బాషా, సురేష్, వెంకటేశ్వర్లు, యశ్వంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పీఈటీ సేవలకు సత్కారం


గ్రేస్ ప్రతిమను సన్మానిస్తున్న అధికారులు

సత్యవేదు : మండలంలోని పుదుకుప్పం తమిళ మీడియం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వ్యాయామ ఉపాధ్యాయురాలు గ్రేస్ ప్రతిమ మంగళవారం విద్యాశాఖ అధికారులు నుంచి సన్మానం అందుకున్నారు. రామచంద్రాపురం మండలంలోని వెరిటాస్ సైనిక్ స్కూల్‌లో అన్నమయ్య, తిరుపతి, నెల్లూరు జిల్లాల హెడ్మాస్టర్లకు నిర్వహించిన ఆరు రోజుల లీడర్ షిప్ కార్యక్రమంలో ఉన్నతాధికారులు ఆమెకు విధులకు కేటాయించారు. సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని పీఈటీని అభినందిస్తూ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎంఈఓ శివశంకర్, కో ఆర్డినేటర్ సారథి, ఎంఈఓ భాస్కర్ ఘనంగా సన్మానించారు.

విజ్ఞాన ప్రదర్శనలతో సృజనాత్మకత

సత్యవేదు : సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థుల్లో సృజనాత్మకత అలవడుతుందని ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం సత్యవేదు బాలుర ఉన్నత పాఠశాలలో వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించారు. సైన్సు ఎగ్జిబిషన్‌ను ఎంపీడీఓతో పాటు ఎంఈఓలు రవి, ఉష, ప్రధానోపాధ్యాయురాలు భారతి తిలకించారు. హోం సెక్యూర్టీ అలారం ప్రదర్శించిన సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి జస్వంత్‌కు ప్రథమ బహుమతి, ఇరుగుళం ఉన్నత పాఠశాల విద్యార్థి చరణ్ ప్రదర్శించిన రోబో ఫర్ హోటల్ ప్రదర్శనకు రెండో బహుమతికి ఎంపిక అయింది. కార్తీక్ ప్రదర్శించిన ఎర్త్ కేక్ అలారం మూడో బహుమతి సాధించింది. చెంగల్రాయం, మోహన్, నాగార్జున, సుబ్బరాయుడు, పాండు రంగయ్య, శ్రీదేవి, మనోహర్ పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ : స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలో వైజ్ఞానిక ప్రదర్శనలో మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పలు అంశాలపై ప్రదర్శించిన నమూనాలు ఆకట్టుకున్నాయి. విజేతలకు ఎంఈఓలు రవీంద్రనాథ్, మునిసుబ్రహ్మణ్యం బహుమతి ప్రదానం చేశారు. హెచ్‌ఎంలు, రమణయ్య, టీచర్లు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.


సైన్సు ప్రదర్శనలను తిలకిస్తున్న ఎంపీడీఓ, ఎంఈఓ


బుచ్చినాయుడుకండ్రిగలో..

సాంకేతిక అభివృద్ధితో ఖ్యాతి గడించాలి

శ్రీకాళహస్తి : విద్యార్థులు సాంకేతిక అభివృద్ధితో ఖ్యాతి గడించాలని జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో మండల స్థాయి సైన్స్‌ఫెయిర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మూడు విభాగాల్లో మొదటి స్థానం సాధించిన నమూనాలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి పాల్గొన్నారు.

గురుకుల ప్రిన్సిపల్‌గా సత్యనారాయణ



సత్యవేదు : స్థానిక బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా సత్యనారాయణ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రిన్సిపల్ శ్రీనివాసులు ఉద్యోగ విరమణ చేయడంతో సత్యసాయి జిల్లా పేరూరు గురుకులంలో ఇన్‌చార్జి ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ బదిలీపై సత్యవేడుకు వచ్చారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. 10వ తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామన్నారు.

హైస్కూల్‌ను ఇంటర్ స్థాయికి పెంచాలి


మాట్లాడుతున్న ఎంపీపీ ప్రతిమ

సత్యవేదు : ఇరుగుళం పంచాయతీలోని జడ్పీ ఉన్నత పాఠశాలను ఇంటర్ స్థాయికి పెంచాలని ఎంపీపీ ప్రతిమ కోరారు. మంగళవారం చిత్తూరులో జరిగిన జడ్పీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. సత్యవేడు పంచాయతీ, ఇరుగుళంలలో అంగన్‌వాడీలకు నూతన భవనాలు మంజూరు చేయాలన్నారు. భర్త చనిపోతే వెంటనే సామాజిక భద్రత పింఛను మంజూరు అవుతుందే తప్ప నాలుగు నెలలుగా ఇతర పింఛన్లు మంజూరు కావడం లేదన్నారు.

వేడుకల్లో హద్దు మీరితే చర్యలు

నాగలాపురం : ప్రశాంత వాతావరణంలో నూతన సంవత్సర వేడుకలు జరుపుకోవాలని, సంబరాల పేరుతో హద్దు మీరితే చర్యలు తప్పవని ఎస్ఐ సునీల్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. నూతన సంవత్సర వేడుకల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా స్పెషల్ డ్రైవ్ చేపట్టి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని యువకులు ఎక్కడ పడితే అక్కడ గుంపులు గుంపులుగా నిలబడి కేకులు కట్ చేయడ లాంటివి చేయకూడదన్నారు. 144 సెక్షన్ అమలులో ఉందన్నారు. నూతన సంవత్సర వేడుకలను కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో ఆహ్లాదకరంగా జరుపుకోవాలన్నారు.

షెల్టర్ నిర్మాణానికి వితరణ


మాట్లాడుతున్న అంబేడ్కర్‌స్టార్ కృష్ణ

రేణిగుంట(ఏర్పేడు) : ఏర్పేడు మండలం పాపానాయుడుపేట హైస్కూల్‌లో ప్రార్థన ప్రాంగణం నిర్మాణానికి అంబేడ్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేడ్కర్ స్టార్ కృష్ణ రూ.55,555 అందిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయుడు రాళ్లపల్లి వెంకటరమణ ఉద్యోగ విరమణ సభలో ఆయన ఈ వితరణను ప్రకటించారు. విద్యతోనే వ్యక్తి వికాసం చోటు చేసుకుంటుందన్నారు. విద్యార్థులు బాగా చదివి, ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సునీత, మాజీ సర్పంచ్ తంబా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుందాం

శ్రీకాళహస్తి : లౌకికతత్వాన్ని కాపాడుకుందామని సీపీఎం పిలుపునిచ్చింది. ఆ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణ వ్యాప్తంగా మనమంతా భారతీయులం.. భారతమాత బిడ్డలం అనే కరపత్రాలను పంపిణీ చూశారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ప్రాంతీయ కార్యదర్శి గంధంమణి మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అంబేడ్కర్ రాజ్యాంగానికి తూట్లు పొడిచే కుట్ర చేస్తోందని ఆరోపించారు. ముఖ్యంగా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందు పరిషత్ వంటి హిందుత్వ శక్తులు మత సామరస్యాన్ని దెబ్బతీసే విధంగా ఓట్ల రాజకీయం చేస్తున్నాయని మండిపడ్డారు. దేశ లౌకితత్వానికి భంగం కలిగించే వారిపై కలిసికట్టుగా పోరాడుదామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగేరి పుల్లయ్య, పెనగడం గురవయ్య, వెలివేంద్రం, అన్వర్‌బాషా, మణి పాల్గొన్నారు.

యూటీఎఫ్ క్యాలెండర్ల ఆవిష్కరణ

వరదయ్యపాళెం : మండలంలోని ఉపాధ్యాయ సంఘానికి చెందిన యూటీఎఫ్ సంఘం క్యాలెండర్లను ఆ యూనియన్ నాయకులు నూతన ఆంగ్ల సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. మంగళవారం వరదయ్యపాళెంలోని కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో క్యాలెండర్లు, డైరీలను ఎంఈఓ సరస్వతి, సీఆర్‌సీ ప్రధానోపాధ్యాయులు వెంకటరమణయ్యల చేతుల మీదుగా ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు రామకృష్ణారెడ్డి, అధ్యక్షుడు శశికుమార్, ప్రధాన కార్యదర్శి సురేష్ భగవాన్, జిల్లా కౌన్సిల్ సభ్యులు రుషేంద్రబాబు, వెంకటయ్య, రాజమోహన్‌బాబు, కొండలరావు, రాజు పాల్గొన్నారు.

దోమల నిర్మూలనకు ఫాగింగ్

నాగలాపురం : మండల కేంద్రమైన నాగలాపురం మేజర్ పంచాయతీలో సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో జ్వరాల నేపథ్యంలో ప్రతి వీధిలోనూ దోమల నివారణ కోసం ఫాగింగ్ చేయించారు.

భూసమస్యలపై వినతులు


అత్తూరు సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్

రేణిగుంట : రెవెన్యూ సదస్సులను వినియోగించుకుని భూసమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ సురేష్‌బాబు కోరారు. మండలంలోని అత్తూరు, అమ్మవారిపట్టెడలో మంగళవారం రెవెన్యూ సదస్సు జరిగింది. మొత్తం ఆరు వినతులు వచ్చాయి. సర్పంచ్ ప్రసాద్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

20న మహాకుంభాభిషేకం

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరి కుమారస్వామి ఆలయం కింద ఉన్న మండపంలో విఘ్నేశ్వరస్వామి మహాకుంభాభిషేకం ఈనెల 20వ తేదీ నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం 9 గంటల నుంచి 10 గంటల లోపు ఈ పూజలు జరుగుతాయన్నారు.

వితంతు పింఛన్ ఎంపికలో జాప్యం తగదు

నారాయణవనం : భర్త చనిపోయిన మరుసటి నెలకే భార్యకు పింఛన్ మంజూరు చేయడంలో అధికారులు చిత్తశుద్ధి చూపాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం సూచించారు. సోమవారం నారాయణవనం పంచాయతీ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని పింఛన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భర్త చనిపోయిన మరుసటి నెలకే భార్యకు పింఛన్ ఇవ్వాలని నవంబర్‌లో ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని గుర్తు చేశారు. జీవో మేరకు కొత్త పింఛన్‌లు ఎందుకు మంజూరు చేయలేదని అధికారులను ప్రశ్నించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జయరామయ్య, ఇన్‌చార్జి ఎంపీడీవో గుణశేఖర్, కార్యదర్శి షణ్ముగం, రెవెన్యూ, సచివాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ఆసుపత్రికే!


కరకంబాడి వద్ద తికమకగా రైల్వే అండర్ బ్రిడ్జ్ రాకపోకలు

శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట): రేణిగుంట మండలం కరకంబాడి వద్ద నూతనంగా నిర్మించిన రైల్వే అండర్ బ్రిడ్జ్, పాత అండర్ బ్రిడ్జ్ పక్క పక్కనే ఉండటంతో ఏ వాహనం ఎటువైపు వస్తుందో తెలియకుండా వాహనదారులు తికమక పడుతున్నారు. రెండు వైపులా రెండు బ్రిడ్జిల్లో వాహనాలు అటు, ఇటు రావడం వలన ఏ బ్రిడ్జి నుంచి ఏ వాహనం వస్తుందో తెలియడం లేదు.దీంతో ప్రమాదాలు ఎక్కువ జరిగే అవకాశాలు ఉన్నాయి.